సాక్షి
విశాఖపట్నం
శనివారం, 13, జూలై, 2024




అధికారపార్టీ మెప్పకోసం..

కూటమి కార్యకర్తలు పసుపు బిళ్లలు చూపించకపోయినా.. వారి మెప్ప కోసం పలువురు ఉద్యోగులు విన్యాసాలు చేస్తున్నారు. 8లో



కేజీహెచ్ కిటకిట


కేజీహెచ్‌లో రోగులకు మందులిచ్చే కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. అన్ని కౌంటర్లు రోగులలతో రద్దీగా ఉంటున్నాయి. 8లో



పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

సాధారణ ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. పలు రైళ్లకు అదనంగా జనరల్ కోచ్‌లను జతచేస్తున్నారు. 8లో

ఇంకా ఎన్నాళ్లీ.. ఆర్థిక అబద్ధాలు



క్యాలెండర్లు మారుతున్నాయి.. దశాబ్దాలు గడుస్తున్నాయి.. కానీ మాట మాత్రం మారడం లేదు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు చర్విత చరణంగా ఒకే అబద్ధాన్ని వల్లె వేస్తూ విశాఖ ప్రజలను మొత్తంగా ఉత్తరాంధ్రను మోసం చేస్తూ వస్తున్నారు. విశాఖలో ఏ సదస్సు జరిగినా.. చంద్రబాబు నోటి వెంట వచ్చే మొదటి మాట.. "వైజాగ్‌ను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాను. ప్రపంచపటంలో నిలబెడతాను". 30 ఏళ్లుగా నగరాన్ని ఆర్థిక రాజధానిగా మార్చేందుకే ప్రయత్నిస్తున్నారా సీఎం సార్ అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

1997 హైదరాబాద్ రాజధానే అయినా.. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తా..

1999 విశాఖపట్నం బ్యూటిఫుల్ సిటీ.. ఈ నగరాన్ని రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో పెడతా..

2014 వన్ సైడ్ సీ.. త్రీసైడ్స్ హిల్స్.. వైజాగ్ మోస్ట్ బ్యూటిఫుల్ సిటీ. ఆర్థిక రాజధానిగా, నాలెడ్జ్‌హబ్‌గా చేసి అంతర్జాతీయ సంస్థలను ఇక్కడికి తీసుకొస్తా..

2024 అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసి.. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఫిన్‌టెక్ హబ్‌గా మార్చేస్తా..

- **విశాఖపై అవ్యాజ ప్రేమ కురిపిస్తున్న చంద్రబాబు**
- **సీఎంగా ఉన్న ప్రతిసారీ విశాఖను ఆర్థిక రాజధాని చేస్తానంటూ ప్రగల్భాలు**
- 1997 నుంచి ప్రతీసారీ అదే పాట..
- వైజాగ్‌లో కించిత్తు అభివృద్ధి కూడా చెయ్యని టీడీపీ సర్కారు
- మరోసారి విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా, ఆర్థిక రాజధానిగా చేస్తానంటూ గొప్పలు
- ఇకపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు అమరావతిలోనే..
- విశాఖ బ్రాండ్‌ను క్రమంగా తగ్గించేందుకు టీడీపీ సన్నాహాలు
- వైఎస్ జగన్ హయాంలో నిర్వహించిన సదస్సులతో అంతర్జాతీయ ఖ్యాతి

సాక్షి, విశాఖపట్నం : ఆర్థికాభివృద్ధి అంటే.. భారీభవంతులు నిర్మించడం మాత్రమే కాదు.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం.. ప్రతిప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం.. సగటు వ్యక్తి చెంతకు పరిపాలన వ్యవస్థను తీసుకురావడం.. ఆహ్లాదాన్ని పంచి.. ఉపాధి అవకాశాలు కల్పించి.. ప్రతి ఒక్కరూ సామాజికంగా.. ఆర్థికంగా ఎదగడం. కానీ 1995 నుంచి వివిధ దఫాలుగా సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు.. ఏ సంవత్సరం కూడా.. తాను చెప్పిన ఆర్థిక రాజధాని అబద్ధాన్ని నిజం చెయ్యాలన్న ఆలోచన మాత్రం ఏ కోశానా చెయ్యలేదు. కేవలం మాటలతోనే కోటలు కట్టేస్తున్నారే తప్ప.. వైజాగ్ అభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడలేదు.

ఆర్థికంగా ఎప్పుడు అభివృద్ధి చేశారు?

ఎప్పుడూ ఆర్థిక రాజధానిగా చేస్తానని చెప్పడమే తప్ప..విశాఖపై చంద్రబాబు చూపించేది కేవలం కపట ప్రేమేనని ఆయన చూపించిన వివక్షే స్పష్టం చేస్తోంది. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించిన చంద్రబాబు.. తొలుత హైదరాబాద్ పైనే దృష్టిసారించారు. కానీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రుషికొండలో ఐటీసెజ్‌కు బాటలు వేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మరణం తర్వాత ఐటీ కంపెనీలకు అందించే ప్రోత్సాహకాలపై తర్వాత ప్రభుత్వాలు క్రమేపీ శీతకన్ను వెయ్యడంతో చంద్రబాబు, లోకేష్ హయాంలో ఒక్కొక్కటిగా నిర్వీర్యమైపోయాయి. 1999లో రూ.284 కోట్లగా ఉన్న ఐటీ ఎగుమతులు టర్నోవర్ 2009 నాటికి రూ.32,509 కోట్లకు పెరిగింది. 2010–11లో ఐటీ ఉత్పత్తుల విలువ రూ.3,600 కోట్లకు దిగజారిపోయింది. దిగ్గజ కంపెనీలు కూడా రాలేదు. మరి ఆర్థిక రాజధానిగా విశాఖను ఏం అభివృద్ధి చేసినట్లని ఐటీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.



విశాఖను విస్మరించారిలా...

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వేల కోట్ల రూపాయల భూ కుంభకోణంతో టీడీపీ ప్రభుత్వం విశాఖ పరువు తీసింది. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు సాగరతీరాన్ని, భీమిలి, మధురవాడ ప్రాంతాలను చెరబట్టారు. తమ పార్టీ నేతలే రూ.వేల కోట్ల భూములు దోచుకున్నారంటూ అప్పటి మంత్రి, ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడే సిట్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో విశాఖలో స్థలం కొనాలంటే భయపడే స్థాయికి తీసుకొచ్చారు.

- మెట్రో రైలు ప్రాజెక్టును తీసుకొస్తామని చెప్పిన చంద్రబాబు.. కేంద్రానికి డీపీఆర్ ఇచ్చేశామంటూ అబద్ధాన్ని ప్రచారం చేశారు. కానీ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో డీపీఆర్‌ని కేంద్రానికి పంపించింది.
- విశాఖను ఆర్థికరాజధానిగా చెయ్యాలని నిజంగా టీడీపీకి ఉంటే.. ఎయిమ్స్ విశాఖలోనే ఏర్పాటు చేసేవారు. కానీ అమరావతిలో భూములు కేటాయించి నిర్మించారు.
- చివరికి ఈ దఫాలోనూ అదే పల్లవి అందుకున్న చంద్రబాబు చివరిగా చెప్పిన మాట అందర్నీ విస్మయానికి గురి చేస్తోంది. విశాఖ నగరం అంటే.. ప్రపంచస్థాయి సదస్సులకు కేరాఫ్‌గా మారింది. జీ20, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023తో పాటు విభిన్న అంతర్జాతీయ సదస్సులు జరిగాయి. ఇకపై అమరావతిలో గ్లోబల్ సమ్మిట్స్ నిర్వహిస్తామంటూ రెండు రోజుల క్రితం మెడ్‌టెక్ జోన్‌లో జరిగిన సదస్సులో చంద్రబాబు చెప్పడం చూస్తే.. విశాఖలో ఇకపై అంతర్జాతీయ సదస్సులు జరగబోవని స్పష్టమవుతోంది.
- వైఎస్సార్‌సీపీ హయాంలో విశాఖ నగరం అద్భుతంగా రూపుదిద్దుకుంది. అంతర్జాతీయ సంస్థలు ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్ఎస్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్ మొదలైన దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు క్యూ కట్టాయి. జీఐఎస్–2023లో 46 దేశాల ప్రతినిధులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరై విశాఖ అభివృద్ధిని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారు. ఇలా అన్ని రంగాల్లోనూ విశాఖను ముందుకు తీసుకెళ్తూ.. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ఐదేళ్లలోనే అడుగులు వేసింది. కానీ మూడు దశాబ్దాలుగా ఆర్థిక రాజధాని చేస్తామంటూ బీరాలు పలుకుతున్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం వైజాగ్ అంటే నిరంతరం ఏదో ఒక రకంగా వివక్ష చూపిస్తూనే ఉంది.

న్యూస్‌రీల్


దివ్యాంగుల స్కూల్‌ను సందర్శించిన ఎమ్మెస్కే



స్కూల్ నిర్వాహకులతో ఎమ్మెస్కే ప్రసాద్

ఎంవీపీకాలనీ: ఉషోదయ కూడలి దరి హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలను బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ సందర్శించారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం పాఠశాలకు చేరుకొని కొద్దిసేపు చిన్నారులతో గడిపారు. స్కూల్‌లోని దివ్యాంగ విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ వచ్చిన ప్రతిసారి హిడెన్ స్ప్రౌట్స్ విద్యార్థులను తాను కలవడం జరుగుతుందన్నారు. వారితో మాట్లాడితే ఎంతో మానసిక ఆనందం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకుడు శ్రీనివాస్‌తో పాటు ఏపీ క్రికెట్ టీం సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్‌వీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.

ఖాళీ షాపులకు వేలం నిర్వహించాలి



కైలాసగిరిలో పర్యటిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర

విశాఖ సిటీ: కైలాసగిరిపై ఖాళీగా ఉన్న వాణిజ్య సముదాయాలను సాధ్యమైనంత వేగంగా వేలం నిర్వహించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ వి.రవీంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కైలాసగిరి కొండపై పర్యటించారు. ఖాళీ షాపులను చూసి వెంటనే వేలం నిర్వహించి సంస్థకు ఆదాయ వనరులు పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నడక దారులలో పాడైన టైల్స్ మార్చాలని, పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో సీఈ భవానీ శంకర్, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శార్వాణి , అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాస్, బేగం పాల్గొన్నారు.

కొద్దిసేపు సర్వర్ డౌన్

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే రిజర్వేషన్ కౌంటర్లు శుక్రవారం కొద్దిసేపు పనిచేయలేదు. రిజర్వేషన్ సిస్టం (క్రిస్) కోల్‌కతాలో పలు నిర్వహణ, మార్పులను చేపట్టడంతో సుమారు అరగంటసేపు రిజర్వేషన్ సిస్టంలు పనిచేయలేదని అధికారులు తెలిపారు.

నాడు సిద్ధాంతాలు..నేడు రాద్ధాంతాలు

- రాజకీయాల పట్ల ప్రజల్లో గౌరవం తగ్గిపోతోంది..
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కొమ్మాది: నాడు రాజకీయాల్లో సిద్ధాంతాలు ఉండేవని..నేడు రాద్ధాంతాలే జరుగుతున్నాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అందుకే రాజకీయ నాయకుల పట్ల ప్రజల్లో గౌరవం రానురానూ తగ్గిపోతోందన్నారు. శుక్రవారం సాయంత్రం రుషికొండలో గల ఏ 1 గ్రాండ్‌లో వెంకయ్యనాయుడు 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిత్రులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో నిదానంగా మార్పు వస్తుందని కులం, మతం, డబ్బు వంటి వాటి ప్రభావం పెరుగుతుందన్నారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితం హాయిగా నడిచిందని సంతోషం వ్యక్తం చేశారు. విశాఖ అన్నా.. సముద్ర తీరం అన్నా చాలా ఇష్టమని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఉత్తములని పేర్కొన్నారు. ఆత్మీయ సభలో పాల్గొన్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, రాష్ట్ర హోం మినిస్టర్ వంగలపూడి అనిత, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపీ అప్పల నాయుడు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కామనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పథకానికి తూట్లు

- హామీ నిలబెట్టుకోకపోతే ఆందోళన
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలపై ఇప్పటికీ ఓ స్పష్టత లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. తల్లికి వందనం జీవో అస్పష్టంగా ఉండడమే ఇందుకు నిదర్శనమని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం పథకానికి తూట్లు పొడవడానికి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతుందన్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ప్రతి ప్రచార సభల్లోనూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ చెప్పారన్నారు. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నెలరోజులైనా ఇంతవరకు తల్లికి వందనం పథకంపై స్పష్టత ఇవ్వకుండా దాటవేసే ధోరణిలో ఉందన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తున్నట్టు జీవోలో ఎక్కడా స్పష్టంగా పేర్కొనలేదన్నారు.

దీనిని బట్టి తల్లికి వందనం పథకానికి తూట్లు పొడిచే ప్రక్రియ సాగుతున్నట్టు స్పష్టమవుతోందన్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వాలని, తక్షణం తల్లి బ్యాంకు అకౌంట్‌లో నగదు జమ చేయాలని వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నారసింహావతారంలో జగన్నాథుడు



నారసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

దాబాగార్డెన్స్ : జగన్నాథస్వామి రథోత్సవాలు నగరంలో కనులపండువగా జరుగుతున్నాయి. టర్నరు చౌల్ట్రీ వద్ద బలభద్రుడు, సోదరి సుభద్రతో కొలువుదీరిన స్వామి శుక్రవారం నారసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజామున 5 గంటలకు మేల్కొలుపు అనంతరం ప్రత్యేక పూజలు, లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. .

పట్టువస్త్రాల సమర్పణ

సింహాచలంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుంచి కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి దంపతులు, ప్రధాన అర్చకుడు రమణమూర్తి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఆనంద్‌కుమార్ పర్యవేక్షకులు నాదస్వర వేదమంత్రాలతో జగన్నాథ స్వామికి పట్టు వస్త్రాలు జగన్నాథస్వామి ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు యేడిద సురేష్‌బాబుకు అందజేశారు. మధ్యాహ్నం 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణింగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు వామన అవతారం

రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా శనివారం జగన్నాథస్వామి వామన అవతారంలో దర్శనమివ్వనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులతో కలెక్టర్ మమేకం

వారితో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసిన హరేందిర ప్రసాద్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మల్కాపురం : విద్యార్థులంతా తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెబుతున్న పాఠాలు శ్రద్ధగా వింటున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు పక్కనే ఓ పెద్దాయన వచ్చి కూర్చున్నారు. విద్యార్థులంతా ఒక్కసారిగా ఆయన వైపు చూశారు..ఉపాధ్యాయుడు కూడా చూసి నమస్తే సార్..అని పలకరించడంతో విద్యార్థులు కూడా లేచి నిలబడి నమస్తే చెప్పారు. మా పాఠశాలకు వచ్చింది కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అని తెలుసుకుని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. పౌష్టిక విలువలతో కూడిన భోజనం సమకూర్చాలని, నిర్ణీత సమయానికి అందజేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అక్కడి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం కాసేపు వివిధ తరగతుల విద్యార్థులతో ముచ్చటించారు. అక్కడ అందుతున్న విద్య, ఇతర సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సుమారు అరగంట సేపు ముచ్చటించిన ఆయన వివిధ అంశాలపై ప్రశ్నలు వేశారు. వారితో సరదాగా గడిపారు. బాగా చదువుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలో కలియ తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. ఈ వారం రోజుల్లో అక్షయ పాత్ర భోజన తయారీ శాలలను కూడా తనిఖీ చేయనున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ, ఎస్.ఎస్.ఎ. ఏపీసీ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

రేపు మోకాళ్ల నొప్పులపై అవగాహన సదస్సు

ఆరిలోవ: మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మోకాళ్ల నొప్పులపై ఆరిలోవలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును ఆరిలోవ ప్రాంతం పెదగదిలి సమీపం ఎర్నిదుర్గమాంబ ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు ఆస్పత్రి హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు అవగాహన కల్పిస్తారన్నారు. కీళ్ల నొప్పులు, అరుగుదల తదితర వాటి గురించి అవగాహన కల్పించడంతో పాటు బోన్ మినరల్ డెన్సిటీ, బ్లడ్ షుగర్, రాండమ్ బ్లడ్ షుగర్, ఈసీజీ, మహిళలకు పాప్స్ స్మెర్ తదితర ఉచిత పరీక్షలు చేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తిగలవారు 95055 56506 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్పొరేట్ సంస్థల్లో నాయకత్వ ప్రతిభ అవసరం

సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ మురళీ కృష్ణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

బీచ్‌రోడ్డు : గ్లోబల్ ఎకోసిస్టమ్‌కు ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్ (నీతి) అవసరమని సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ మురళీ కృష్ణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో మేక్ ఇన్ ఇండియా, ఇండియన్ ఎకోసిస్టమ్‌లో ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల్లో నాయకత్వ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, నైతిక, ప్రామాణికమైన నాయకత్వాన్ని పెంపొందించడానికి ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్ అత్యవసరమన్నారు. వైవిధ్యం, సమానత్వం ప్రోత్సహించే కార్యక్రమాలు వివక్ష, అసమానతలను పరిష్కరించడంలో ప్రధానమైనవన్నారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ రంగంలో బలమైన నాయకత్వం, నైపుణ్య గణన ఆవశ్యకతను వివరించారు. సదస్సులో సీఐఐ సదరన్ రీజియన్ ఈడీ పద్మకుమార్, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో 'సాగర్ కవచ్'



విన్యాసాల్లో పాల్గొన్న నౌకలు

సింధియా : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తీరప్రాంత భద్రతను అంచనా వేయడమే లక్ష్యంగా రెండు రోజులపాటు సాగర్‌కవచ్ నిర్వహించారు. ఈ వ్యాయామంలో ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్, సీఐఎస్ఎఫ్, కస్టమ్స్, ఆర్పీఎఫ్, స్టేట్ పోలీస్, మెరైన్ పోలీస్, ఫిషరీస్, ఐబీ, పోర్ట్ అథారిటీస్ వంటి స్టేట్ ఏజెన్సీలు చురుగ్గా పాల్గొన్నాయి. తూర్పు నౌకాదళ కమాండ్ పరిధిలోని నేవల్, కోస్ట్‌గార్డ్ వైమానిక ఆస్తులు కాపడడమే ధ్యేయంగా వైమానిక నిఘా నిర్వహించిన ఈ వ్యాయామంలో భారత నౌకాదళ నౌకలు, కోస్ట్ గార్డ్ నౌకలు పాల్గొని విన్యాసాలు ప్రదర్శించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

సచివాలయ కార్యదర్శుల కొట్లాటపై విచారణ

గాజువాక: గాజువాక జోన్ 67వ వార్డు జోగవానిపాలెం సచివాలయం కార్యదర్శుల కొట్లాట ఘటనపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, యూసీడీ విభాగం అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. కొట్లాటకు పాల్పడిన కార్యదర్శులతోపాటు అదే సచివాలయంలో పనిచేస్తున్న ఇతర కార్యదర్శులు, సిబ్బందిని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ లింగేశ్వరరెడ్డి, టీపీబీవో రేవతి, యూసీడీ ఏపీడీ ఎల్.రాము విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. పింఛన్ల పంపిణీకి సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన పని తనది కాదంటే తనది కాదంటూ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ జల్లూరు సమరం, ప్లానింగ్ సెక్రటరీ అన్నెపు శ్రీనివాస్ ఒకరినొకరు కొట్టుకున్నారు. వారిని విడదీయడానికి ప్రయత్నించిన అడ్మిన్ కార్యదర్శి రమణిని పక్కకు నెట్టేయడంతో ఆమె చేతికి గాయమైంది. దీనిపై సమాచారం అందుకున్న జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు సంబంధిత కార్యదర్శులను పిలిపించి మందలించడంతోపాటు వారిపై విచారణ చేపట్టాలని యూసీడీ అధికారులను ఆదేశించారు. దీంతో సచివాలయంలోని వివిధ విభాగాల కార్యదర్శులు, అడ్మిన్‌లను అధికారులు విచారించారు. కొట్లాట జరిగినట్టు వారు అంగీకరించారని, దీనిపై తదుపరి చర్యలకు జోనల్ కమిషనర్‌కు నివేదిక అందించామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

నేడు ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల మార్పిడికి అవకాశం

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు శుక్రవారంతో ముగిసింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ కేంద్రానికి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా నిర్వహించి వీరికి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి సిబ్బంది సహకరించారు. వీరు తమ ఆప్షన్లను ఫ్రీజ్ చేశారు. శనివారం ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. ఈనెల 16న సీట్లు కేటాయిస్తారు. 17 నుంచి 22 తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఆన్‌లైన్‌లో చేసి కాలేజీలకు ఆ రిపోర్టు సమర్పించాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా పాలిసెట్ ఆఖరి దశ కౌన్సెలింగ్ శుక్రవారం కొనసాగింది. విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి ఆప్షన్లు పెట్టుకున్నారు. శనివారంతో పాలిటెక్ వెబ్ ఆప్షన్ల గడువు ముగుస్తుంది.

డ్రైవర్‌పై దాడి.. 8 మంది అరెస్ట్

- గంజాయి మత్తులో లారీ డ్రైవర్‌పై దాడి
- నిందితుల్లో ముగ్గురు మైనర్లు

ఎంవీపీకాలనీ/ఆరిలోవ: జాతీయ రహదారిలో లారీ డ్రైవర్‌పై దాడికి పాల్పడి సెల్ ఫోన్‌తో పాటు రూ.10 వేలను అపహరించిన ఘటనలో విశాఖ నేర విభాగం పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి జరిగిన ఈ కేసును 24 గంటల్లో క్రైం పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను విశాఖ క్రైం డీసీపీ పి.వెంకటరత్నం శుక్రవారం ఎంవీపీ కాలనీ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శ్రీకాకుళం నుంచి బియ్యం లోడుతో ఓ లారీ నగరానికి వస్తుండగా జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో మరమ్మతులకు గురైంది. దీంతో లారీని డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపేశాడు. అదే సమయంలో గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు నాలుగు ద్విచక్రవాహనాలపై వచ్చి నిలిపి ఉన్న లారీ వద్ద ఆగారు. ఆ లారీ డ్రైవర్‌ను పిలిచి ఎండాడ వద్ద ఓ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొని ఆగకుండా వచ్చేశావంటూ బెదిరించారు. అంతటితో ఆగకుండా పిడిగుద్దులు గుద్ది అతని వద్ద ఉన్న రూ.10 వేలు, సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో ఆ డ్రైవర్ ఆరిలోవ పోలీసులను ఆశ్రయించి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు.. సీపీ ఆదేశాలతో నిందితులను పట్టుకోవడానికి ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ ఘటనకు పాల్పడిన 8 మంది యువకులను గుర్తించి అరెస్ట్ చేశారు. వీరు పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన తోట నాగరాజు(18), తోట దుర్గాప్రసాద్(19), బొచా హరీష్(18), అరుగుల భాను(19), మెరుగు నరసింహాలు(19) కాగా.. మిగిలిన ముగ్గురు మైనర్‌లు. ఘటనా స్థలంలో లభించిన ఓ బైక్ వివరాల ఆధారంగా వీరిని వేర్వేరు ప్రాంతాల్లో అదుపులో తీసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. డ్రైవర్ సెల్‌ఫోన్‌తో పాటు రూ.5వేలును వారి నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. వీరు జల్సాలు, వ్యసనాలకు అలవాటు పడి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరంతా 6 నుంచి 9 తరగతుల వరకు విద్యనభ్యసించి తర్వాత స్కూల్ మానేసినవారేనన్నారు. 5 నుంచి 6 ఏళ్లుగా పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో స్నేహితులుగా ఉన్నారన్నారు. వీరు ప్రస్తుతం వినియోగిస్తున్న నాలుగు ద్విచక్ర వాహనాలు గతంలో వేర్వేరు ప్రాంతాల్లో దొంగిలించినవిగా గుర్తించి, వాటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీరిపై గతంలో ఎలాంటి కేసులు నమోదు కాలేదన్నారు. సమావేశంలో విశాఖ క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు, ద్వారకా క్రైం సీఐ ఆడమ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వెంకటరత్నం

ఏపీఎల్ టైటిల్ పోరుకు వారియర్స్

- నేడు ఉత్తరాంధ్ర లయన్స్‌తో ఢీ

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్‌లో కొత్త చాంపియన్ అవతరించనుంది. ఈ సీజన్‌లో అనూహ్యంగా గత సీజన్లలో విజేతలు కింగ్స్, రైడర్స్ ఈసారి నాకౌట్ దశలోనే వెనుదిరగ్గా.. ఉత్తరాంధ్ర లయన్స్‌తో శనివారం జరిగే టైటిల్ పోరుకు వైజాగ్ వారియర్స్ సిద్ధమైంది. వైఎస్సార్ స్టేడియంలో శుక్రవారం జరిగిన క్వాలిఫైయర్-2లో రాయలసీమ కింగ్స్ టాస్ గెలిచి లక్ష్య ఛేదనకే మొగ్గుచూపింది. దీంతో వైజాగ్ వారియర్స్ తొలుత బ్యాటింగ్ చేయగా ఓపెనర్ మునీష్ 12 పరుగులతో వెనుదిరిగాడు. అతని స్థానంలో వచ్చిన కెప్టెన్ భరత్ 26 బంతుల్లోనే 53 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. వారియర్స్ 11.5 ఓవర్‌లో 108 పరుగుల వద్ద భరత్ వికెట్ కోల్పోయింది. తేజ 10 పరుగులకే వెనుదిరగ్గా వారియర్స్ వైస్ కెప్టెన్ అశ్విన్ హెబ్బర్ 58 బంతుల్లో మూడు ఫోర్లు ఆరు సిక్సర్లతో 81 పరుగులతో నిలిచాడు. గిరినాథ్, ఆంజనేయులు చెరో రెండు వికెట్లు తీశారు. వారియర్స్ ఆరు వికెట్లకు 190 పరుగులు చేసింది. 191 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కింగ్స్ ఆట అర్ధభాగానికే 84 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ వంశీకృష్ణ ఏడు పరుగులతోనే వెనుదిరగ్గా మరో ఓపెనర్ ప్రశాంత్ 17 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. రోషన్ 19, కుమార్ 21 పరుగులు చేశారు. అయితే కెప్టెన్ గిరినాథ్‌కు రోహిత్ తోడై 15 ఓవర్లకు జట్టు స్కోర్‌ను 126 పరుగులకు చేర్చాడు. గిరినాథ్(27) సుదర్శన్ బౌలింగ్‌లో తేజకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరగా.. వెంటనే రోహిత్(44) కూడా ఔట్ కావడంతో మ్యాచ్‌పై వారియర్స్ పట్టు సాధించారు. కింగ్స్ 18 ఓవర్లు పూర్తయ్యేప్పటికి ఆరు వికెట్లు కోల్పోయినా 155 పరుగులు చేసి పోటీనిచ్చింది. డెత్ ఓవర్లలో కమరుద్దీన్ ఆరు బంతుల్లో రెండు ఫోర్లు, సిక్సర్లతో 22 పరుగులతో చెలరేగాడు. చివరి ఓవర్‌కు 20 పరుగులు చేయాల్సి వచ్చింది. చివరికి కింగ్స్ ఏడు వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేయగలిగింది. వారియర్స్ ఏడు పరుగులతో తేడాతో విజయం సాధించి టైటిల్ పోరుకు సిద్ధమైంది. సుదర్శన్ రెండు వికెట్లు తీశాడు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం దరి బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న కోనేని మహిత(25) సీఏ ఫైనల్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపం చెందింది. తన గదిలో శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చాలా సమయం వరకు మహిత తన గది నుంచి రాకపోవడంతో ఆమె తల్లికి అనుమానం వచ్చి తలుపు కొట్టింది. ఎటువంటి స్పందన లేకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు తెరిచింది. ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమార్తెను వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలుపై అవగాహన

దాబాగార్డెన్స్: ప్రతీ ఉద్యోగి తన ఆదాయపు వివరాలను విధిగా ఆదాయ పన్ను శాఖకు నిర్ణీత కాలంలో పొందుపరచాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు సూచించారు. జోన్-4 సమావేశ మందిరంలో జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులకు శుక్రవారం ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను దాఖల్లో తప్పుడు సమాచారం అందజేసి అపరాధ రుసుంలు, శిక్షలకు గురికారాదన్నారు. ఆదాయపు పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ మధుసూధనరావు మాట్లాడుతూ ఉద్యోగులకు ఆదాయపు పన్ను చెల్లింపులపై సరైన అవగాహన లేనందున ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆదాయపు పన్ను చెల్లించడం వల్ల ప్రతి ఉద్యోగికి చాలా ఉపయోగాలున్నాయని తెలిపారు. ఆదాయపు పన్ను ఎగవేత చట్టరీత్యా నేరమన్నారు. ఆదాయం పన్నుపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వాటిని నమ్మ వద్దన్నారు. ఏఐఎస్ యాప్ డౌన్ లోడ్ చేసుకుని ప్రతి ఉద్యోగి తమ లావాదేవీలను తెలుసుకోవచ్చన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 31లోగా రిటర్న్స్ పొందుపరచాలని సూచించారు. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఆదాయపు పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేషగిరిరావు, జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య, జోన్-6 జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సన్యాసిరావు

కేజీహెచ్‌లో మందుల కౌంటర్లు కిటకిట

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు మందులిచ్చే కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. అన్ని కౌంటర్లు రోగులు, వారి బంధువులతో రద్దీగా ఉంటున్నాయి. కేజీహెచ్‌కు ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా నుంచి రోజూ పెద్ద సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకుని కేజీహెచ్ అధికారులు మందుల కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగం వద్ద మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునికీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే మూడు రోజులుగా అన్ని కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం రద్దీ మరింత పెరిగింది. మందుల కోసం రోజువారీ రోగులే కాకుండా పాత రోగులు వస్తుంటారు. ఇలా దాదాపు 3 వేల మందికి పైగా ఓపీ టికెట్లపై మందుల కోసం వచ్చారు. కౌంటర్ల సంఖ్య మరింత పెంచాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

నేడు కేజీహెచ్‌కు కలెక్టర్

- 15న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక

మహారాణిపేట: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శనివారం కింగ్ జార్జ్ ఆస్పత్రిని సందర్శించనున్నారు. తొలిసారిగా కలెక్టర్ కేజీహెచ్‌కు వస్తుండడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 15న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కేజీహెచ్ పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యాధికారులతో సమావేశం కానున్నారు. ఇటీవల కేజీహెచ్‌లో పలు అంశాలు చర్చనీయాంశమయ్యాయి. గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసీని సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నర్సింగ్ సూపరింటెండెంట్ అప్పటి సూపరింటెండెంట్‌పై పలు ఆరోపణలు చేశారు. దీంతో ఆ సూపరింటెండెంట్ మీద పోలీసు కేసు నమోదు కావడం, దీర్ఘకాలిక సెలవులో వెళ్లిన సంగతి విదితమే. ఆ తర్వాత ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ విభాగాధిపతి(హెచ్‌వోడీ) డాక్టర్ పి.శివానంద్‌ను నియమించారు. పూర్వ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కేజీహెచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. ఎప్పటికప్పుడు కేజీహెచ్‌ను సందర్శించడం, ఆస్పత్రి అభివృద్ధి నిధులు, సీఎస్సార్ నిధులతో అత్యవసర పనులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కాగా.. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ నెల 15న కేజీహెచ్‌కు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ రానున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కేజీహెచ్‌లో పర్యటించే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రికి మెరుగులు దిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులపై అవగాహన పొందేందుకు కలెక్టర్ ముందుగానే ఆస్పత్రిని సందర్శిస్తున్నట్లు సమాచారం.

వర్కింగ్ జర్నలిస్టుల సర్వ సభ్య సమావేశం నేడు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నగర అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం అక్కయ్యపాలెంలోని ఓ హోటల్‌లో ప్రస్తుత కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకన్య థియేటర్ వద్ద ఉన్న సింకా గ్రాండ్‌లో సర్వ సభ్య సమావేశం జరుగుతుందని, జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై చర్చిస్తామన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించి సమావేశంలో తీర్మానం చేస్తామన్నారు. అనంతరం విశాఖ అర్బన్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

రైల్వే సాధారణ ప్రయాణికులకు శుభవార్త

- పలు రైళ్లకు అదనపు జనరల్ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: సాధారణ ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. పలు రైళ్లకు అదనంగా జనరల్ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. అంచెలంచెలుగా మొత్తం 46 రైళ్లకు రెండేసి చొప్పున మొత్తం 92 నూతన జనరల్ కోచ్‌లను జతచేయనున్నారు. విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే హౌరా-సికింద్రాబాద్-హౌరా(12703/12704)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-విశాఖపట్నం-హైదరాబాద్(12728/12727)గోదావరి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్-సికింద్రాబాద్(17016/17015)విశాఖ ఎక్స్‌ప్రెస్, న్యూటిన్‌సుకియా-ఎస్ఎంవీ బెంగళూరు (22502/22501) ఎక్స్‌ప్రెస్, డిబ్రూఘడ్-కన్యాకుమారి-డిబ్రూఘడ్(22504/22505) వివేక్ ఎక్స్‌ప్రెస్, సిల్చార్-తాంబరం-సిల్చార్(15630/15629) నాగోన్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-బెంగళూరు-గౌహతి(12510/12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు త్వరలో నూతన జనరల్ కోచ్‌లు జతచేయనున్నారు

నవంబర్ నుంచి అదనపు జనరల్ కోచ్‌లను జతచేయనున్న రైళ్లు ఇవే..

- విశాఖపట్నం-న్యూఢిల్లీ-విశాఖపట్నం(22805/22806) ఏపీ ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-కోర్బా-విశాఖపట్నం(18517/18518) కోర్బా ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-కడప-విశాఖపట్నం(17487/17488) తిరుమల ఎక్స్‌ప్రెస్
- విశాఖ-హజరత్ నిజాముద్దీన్-విశాఖ(12803/12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్
- విశాఖ-హజరత్ నిజాముద్దీన్-విశాఖ(12807/12808) సమతా ఎక్స్‌ప్రెస్
- విశాఖ-లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖ(రాయగడ) (22847/22848) ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-ఢిఘా-విశాఖపట్నం(22874/22873) ఎక్స్‌ప్రెస్
- విశాఖ-లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖ(18519/18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్(18463/18464)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-పుణే-భువనేశ్వర్(22882/22881) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్(22879/22880) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్(22871/22872)ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ -భువనేశ్వర్(12830/12829) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్(12845/12846) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-పుదుచ్చేరి-భువనేశ్వర్(12898/12897) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-రామేశ్వరం-భువనేశ్వర్(20896/20895)ఎక్స్‌ప్రెస్
- పూరీ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-పూరీ(22859/22860) ఎక్స్‌ప్రెస్

రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యం



మంత్రి భరత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న పారిశ్రామిక వేత్తలు

బీచ్‌రోడ్డు : రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. విశాఖలోని నోవాటెల్‌లో ఆయన పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రముఖులు, సీఐఐ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరినట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామికవేత్తలకు మెరుగైన రాయితీలు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ముందుంటామన్నారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి పాలసీని తయారుచేస్తామని మంత్రి టి.జి భరత్ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

18 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు వెల్లడించారు. కుష్టు వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఎం.డి.టి చికిత్సతో ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని స్పష్టం చేశారు. చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని ఎర్రని, రాగి రంగు మచ్చలు ఉండడం, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కను రెప్పలు పూర్తిగా మూయ లేకపోవడం, కనుబొమ్మల, రెప్పల వెంట్రుకలు రాలిపోవడం, నొప్పిగా ఉన్న నరాలు కలిగి ఉండడం ఈ వ్యాధి లక్షణాలు అని చెప్పారు. చేతులు, పాదాలు, నరాల్లో తిమ్మిర్లు ఉన్నా.. అరిచేతులు, కాళ్ల పాదాలు స్పర్శ లేకపోవడం, పొడిబారి పోవడం, చేతులు, పాదాల వద్ద నొప్పిలేని గాయాలు, పుండ్లు కలిగి ఉండడం కూడా వ్యాధికి కారణం కావచ్చన్నారు. చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, మణికట్టు, మడమనుపైకి లేపలేకపోవటం, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం వంటివి కూడా ఈ వ్యాధి లక్షణాలు కావచ్చన్నారు. కావున ఈ నెల 18 నుంచి జరిగే సర్వేలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్న వారు వైద్య సిబ్బందికి వివరాలు అందించాలని సూచించారు.

సీనియర్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడామైదానం వేదికగా శుక్రవారం జిల్లా స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభమైంది. జిమ్నాజియం మైదానంలో గొలగాని అప్పారావు, పి.కొండలరావు జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లాకు చెందిన 22 క్లబ్‌లు పాల్గొంటున్నాయి. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 తేదీ వరకు పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలి మ్యాచ్ కనకదుర్గ, వెంకట్ ఎఫ్‌సీ క్లబ్ మధ్య పోటీ జరిగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ ఉపాధ్యక్షులు సీహెచ్ వెంకట్రావు, ఎం.మాణిక్యం ప్రారంభించారు. కార్యదర్శి అక్కరమాని చినబాబు, రాజారావు, పి.సోమేశ్వరరావు, ప్రభ, గోపి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్ ఉపాధ్యక్షులు వెంకట్రావు, మాణిక్యం

16.9 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రెండు వేర్వేరు కేసుల్లో గంజాయి నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివీ. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ శుక్రవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో రాజస్థాన్ రాష్ట్రం, చురు జిల్లాకు చెందిన మనీష్‌కుమార్ సోనీ, సురేష్ కుమార్ సోనిలు విశాఖపట్నం నుంచి రాజస్థాన్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ.23,500 విలువైన 4.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు జీఆర్పీ ఎస్ఐ బాలాజీ రావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.ఎల్.మీనా తెలిపారు.

మరో కేసులో..

ఆర్పీఎఫ్ ఎస్ఐ ఓ మిస్త్రీ, జీఆర్పీ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిహాల్‌సింగ్, గోపాల్‌శర్మ విశాఖ మీదుగా ఢిల్లీకి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని.. రూ.29 వేల విలువైన 12.2 కిలోల గంజాయిని సాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితలను రిమాండ్‌కు తరలించారు.

తీరంలో షూటింగ్ సందడి

కొమ్మాది: బీచ్‌రోడ్డులోని తొట్లకొండ బీచ్ వద్ద శుక్రవారం షూటింగ్ సందడి నెలకొంది. యాద్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న కంచెర్ల అనే సినిమాకు సంబంధించి హీరో ఉపేంద్ర, హీరోయిన్ ప్రణతిలపై ఓ పాటను చిత్రీకరించారు. కంచెర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న ఈ సినిమాకు ఫొటోగ్రఫీ డైరెక్టర్‌గా గుణశేఖర్, కొరియోగ్రాఫర్‌గా లుక్స్ రాజశేఖర్ వ్యవహరిస్తున్నారు.



పాటలో నటిస్తున్న హీరోహీరోయిన్

కూటమి నాయకులకు అధికారులు జీ హుజూర్

- పసుపు బిళ్లలు చూపించకపోయినా..!

తగరపువలస: ప్రజల చేత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు భీమిలి నియోజకవర్గంలో అధికారులు విలువనివ్వడం లేదు. ప్రోటోకాల్‌ను విస్మరించి ఏ మాత్రం అధికారం లేని కూటమి నాయకుల ముందు సాగిలపడుతున్నారు. కూటమి కార్యకర్తలు పసుపు బిళ్లలు చూపించకపోయినా.. అధికార పార్టీ మెప్పు కోసం పలువురు ఉద్యోగులు విన్యాసాలు చేస్తున్నారు. ఇటీవల వరసగా జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను చూస్తే అధికారుల ధోరణి అర్థమవుతోంది. దీనిపై భీమిలిలో ఇప్పటికే పలుచోట్ల ప్రజాప్రతినిధులు దిగువస్థాయి అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తుండగా.. క్షమాపణలతో సరిపెడుతున్నారు. ఇప్పటి వరకు జీవీఎంసీ పరిధితో పాటు గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యాకానుకలు, లబ్ధిదారులకు అందించిన పింఛన్లు, రైతులకు ఇచ్చిన విత్తనాలు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు కనిపించడం లేదు. చాలా చోట్ల వారికి సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి ప్రజాప్రతినిధి హోదా లేకుండానే కూటమి నాయకులు జనానికి ఉపన్యాసాలు ఇస్తుంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టు అవుతుందని పలువురు వాపోతున్నారు. ఇటీవల భీమిలి మండలం మజ్జివలసలో జరిగిన విత్తనాల పంపిణీలో స్థానిక సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడుకు సమాచారం లేకుండానే వ్యవసాయాధికారులు టీడీపీ నాయకులతో కలిసి విత్తనాలు పంపిణీ చేసి వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులకు సవాల్ విసిరారు. దీనిపై వీరు ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆనందపురం మండలం బోని పంచాయతీలో పాలకవర్గం ఆధీనంలో ఉండే కల్యాణ మండపాన్ని మూడు రోజుల కిందట ఉన్నతాధికారులు సర్పంచ్ బోని అప్పలకొండ నుంచి అవమానకరమైన రీతిలో స్వాధీనం చేసుకుని స్థానిక టీడీపీ నాయకులకు తాళాలు అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. స్థానిక ఎన్నికల్లో ప్రజల చేత ఎన్నుబడిన తమను కాదని అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజాప్రతినిధులు రగిలిపోతున్నారు. ప్రోటోకాల్ పాటించకుండా.. అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని వాపోతున్నారు. దీనిపై మారోమారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.